విచారణకు హాజరైన నటి సౌమ్యా జాను

వివరాలు సేకరించిన పోలీసులు

బంజారాహిల్స్, మార్చి 6: రాంగ్‌రూట్‌లో రావడమే కాకుండా.. అడ్డుకున్న ట్రాఫిక్ హోంగార్డుపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలో నటి సౌమ్యా జాను అలియాస్ షేక్ జాన్‌బీ (34)ని బుధవారం బంజారాహిల్స్ పోలీసులు విచారించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 24న సాయంత్రం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని కళింగ భవన్ చౌరస్తాలో వేగంగా జాగ్వార్ కారులో వచ్చిన సౌమ్యా జానును అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు విష్ణేష్ అడ్డుకున్నాడు. రాంగ్‌రూట్‌లో వస్తే ప్రమాదం చోటు చేసుకుంటుందని, వెనక్కి వెళ్లాలని సూచించాడు. దీంతో వాగ్వాదానికి దిగిన సౌమ్య.. అతడిని తీవ్రమైన పదజాలంతో దూషించింది. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కోవడంతో పాటు దాడికి దిగింది. దీంతో తన విధులకు అంతరాయం కల్పించడంతో పాటు దాడికి పాల్పడిన సౌమ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. హోంగార్డు విష్ణేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివిధ సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఘటన అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్న సౌమ్యను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఆమె దుబాయి వెళ్లినట్లు గుర్తించారు. ఆమెను రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతుండగానే.. తనను అరెస్ట్ చేయవద్దంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో బుధవారం సౌమ్యా జానును పోలీసులు విచారించి.. ఈ ఘటనపై ఆరా తీశారు. పోలీసుల విచారణకు సహకరిస్తానని, తాను రాంగ్‌రూట్‌లో రావడం తప్పేనని సౌమ్య అంగీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జాగ్వార్ కారు తనది కాదని, తన స్నేహితుల కారులో వెళ్తున్న క్రమంలో ఘటన జరిగిందన్నారు. విచారణ పూర్తయిన తర్వాత అన్ని విషయాలు చెబుతానని పేర్కొంది.

సౌమ్యా జాను

పరీక్షల భయంతో.. విద్యార్థిని ఆత్మహత్య

దుండిగల్, మార్చి 6: ఇంటర్ పరీక్షల భయంతో ఓ యువతి ఐదో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎం.మహాలక్ష్మి, బాపిరాజు దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు కృష్ణవేణి(19) రెండేండ్ల కిందట ఏపీలోనే ఇంటర్ పూర్తి చేసింది. అయితే, ఇంటర్‌లో ఒక సబ్జెక్టు మిగిలడంతో.. అప్పటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నది. ఈ క్రమంలోనే రెండేండ్ల కిందట మహాలక్ష్మి కుటుంబం నగరానికి వచ్చి, స్థానిక వసంతనగర్‌లో ఉంటున్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 15న కృష్ణవేణికి పరీక్షలు ఉండటంతో బాగా చదువుకోమంటూ తల్లిదండ్రులు సూచించారు. ఓ వైపు పరీక్షల భయం, మరో వైపు తల్లిదండ్రుల సూచనతో ఆందోళనకు గురైన కృష్ణవేణి.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తాము నివాసముంటున్న అపార్ట్‌మెంటు ఐదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎయిర్‌పోర్టు రోడ్డులో కారు బీభత్సం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అతివేగంగా శంషాబాద్ వైపు దూసుకొచ్చిన ఓ కారు డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కావడంతో.. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో తలపై బాది

స్వలింగ సంపర్కానికి సహకరించలేదని..

మద్యం మత్తులో బీరు సీసాలతో తలపై దాడి

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు

జీడిమెట్ల, మార్చి 6: మద్యం మత్తులో దారి తప్పిన ఓ వ్యక్తి.. స్వలింగ సంపర్కుడి చేతికి చిక్కి హత్యకు గురయ్యాడు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, ఎస్సైలు సత్తీశ్‌రెడ్డి, హరీశ్ కేసు వివరాలను వెల్లడించారు. బిహార్‌కు చెందిన రమేశ్‌రామ్ (50) కుటుంబం కొంత కాలంగా ఐడీఏ జీడిమెట్ల రాంరెడ్డినగర్‌లో ఉంటున్నది. రమేశ్‌రామ్ ఓ కెమికల్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 27న ఉదయం అతడు తోటి కూలీలైన బిపిన్, ప్రమోద్‌తో కలిసి షాపూర్‌నగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా తెరిచేందుకు వెళ్లాడు. అనంతరం వారిద్దరితో కలిసి మద్యం తాగాడు. బిపిన్, ప్రమోద్ అక్కడి నుంచి వారి ఇండ్లకు వెళ్లిపోయారు. రమేశ్‌రామ్ మాత్రం మద్యం మత్తులో సాయంత్రం 7 గంటల వరకు సుభాష్‌నగర్‌లోనే పడుకున్నాడు. అతడిని స్థానికులు గమనించి.. అతడి వద్దనున్న ఫోన్ ద్వారా అతడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు వచ్చేలోపే అతడు నిద్రనుంచి మేల్కొని.. ఆ మత్తులోనే నడుచుకుంటూ రాత్రి 11 గంటల సమయంలో షాపూర్‌నగర్ చేరుకున్నాడు. అక్కడ రమేశ్‌రామ్‌కు మేడ్చల్‌లోని ఓ కిరణా దుకాణంలో పని చేసే శివపూజన్ కుమార్ నిశాత్(26) కనిపించాడు. శివపూజన్ స్వలింగ సంపర్కుడు కావడంతో.. రమేశ్‌రామ్‌ను మాటల్లో పెట్టి.. హెచ్‌ఎంటీలోని నిర్మాణుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. అనంతరం శివపూజన్ తనతో స్వలింగ సంపర్కం చేయాలని కోరగా.. రమేశ్‌రామ్ నిరాకరించాడు. దీంతో శివపూజన్ కోపంతో బీరు సీసాతో రమేశ్‌రామ్ తలపై కొట్టి, దాడిచేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. 28న ఉదయం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి, నిందితుడిని గుర్తించారు. అయితే, హత్య జరిగిన సమయంలో నిందితుడు శివపూజన్ ప్యాంటుకు రక్తం మరకలు అంటాయి. దీంతో అతడు రమేశ్‌రామ్ ప్యాంటును ధరించాడు. నిందితుడు శివ పూజన్‌ను మేడ్చల్‌లో అదుపులోకి తీసుకున్నారు. నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

భార్యపై కత్తితో దాడి.. భర్త రిమాండ్

కాచిగూడ, మార్చి 6: భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను కాచిగూడ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సై హెచ్. నరేశ్ కథనం ప్రకారం.. నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన బడేసాహెబ్ కుమారుడు ఫక్రుద్దీన్ (80)విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి. కొంత కాలంగా భార్యా భర్తల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. వీరిద్దరి మధ్య మాటామాటా పెరిగి.. బుధవారం భార్యపై మటన్ కత్తితో తల, చేతులపై భర్త దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు భర్త ఫక్రుద్దీన్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మేకల దొంగ అరెస్టు

ఎర్రగడ్డ, మార్చి 6: రోడ్డుపై తిరుగుతున్న పెంపుడు మేకలను తస్కరించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బోరబండ డీఐ భూపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం.. బోరబండ ప్రాంతానికి చెందిన అబ్దుల్ జలీల్ మూడు మేకలను పెంచుతున్నాడు. ఈ నెల 4న మధ్యాహ్నం సమయంలో రోడ్డు వైపు వెళ్లిన మేకలు తిరిగి రాలేదు. దీంతో జలీల్ చాలా ప్రాంతాల్లో గాలించినా మేకల ఆచూకీ లభించలేదు. ఈ నెల 5వ తేదీన బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. బుధవారం నిందితుడు మహ్మద్ గౌస్ ఖురేషిని అరెస్టు చేశారు.

బాచుపల్లిలో దొంగలు

రెండు ఇండ్లల్లో చోరీ

దుండిగల్, మార్చి 6: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలు స్వైర విహారం చేశారు. ఒకేసారి రెండు ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడి అందిన కాడికి దోచుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లాకు చెందిన విశ్వనాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి బాచుపల్లిలోని సీతారం హోమ్స్‌లోని విల్లాలో ఉంటున్నారు. ఈ నెల 5వ తేదీన సాయంత్రం 7.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసిన విశ్వనాథ్.. నిజాంపేటలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఫస్ట్ ఫ్లోర్‌లోకి వెళ్లి చూడగా కబోర్డులు పగులగొట్టి ఉన్నాయి. పరిశీలించగా.. వాటిలో దాచిన 31 తులాల బంగారు ఆభరణాలు, 1220 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా.. అదే కాలనీలోని విల్లా నంబర్ 21బీ నివాసి శ్రీనివాసరావు ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డుపై ఆయిల్..

ర్యాపిడో బైక్ పైనుంచి పడిన ఇద్దరికి గాయాలు

వెంగళరావునగర్, మార్చి 6: రోడ్డుపై ఆయిల్ ఉన్నది.. ర్యాపిడో బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన ఓ మహిళ జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నది. బుధవారం డ్యూటీకి వెళ్లేందుకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నది. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ మీదుగా ప్రయాణిస్తూ.. యూసుఫ్‌గూడ బస్తీ సిగ్నల్ వద్దకు వచ్చే సరికి అక్కడ రోడ్డుపై ఆయిల్ ఉన్నది. దీంతో వాహనం అదుపుతప్పింది. ర్యాపిడోపై ఉన్న మహిళతో పాటు ఆ బైక్ నడిపిస్తున్న వ్యక్తి కూడా కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. రోడ్డుపై ఆయిల్ పోసి, ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నడి రోడ్డుపై.. కారులో మంటలు

ఖైరతాబాద్, మార్చి 6: ప్రధాన రహదారిలో ఓ కారులో నుంచి ఒక్కసారిగా మంటలొచ్చాయి. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది. సైఫాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన నిషాంత్ బుధవారం సాయంత్రం మెహిదీపట్నం నుంచి గాంధీనగర్‌కు తన స్నేహితుడిని తీసుకొని ఫోర్డ్ ఫ్యూజన్ కారులో వెళ్తున్నాడు. లక్డీకాపూల్ పెట్రోల్ పంపు వద్దకు రాగానే.. కారులో దట్టమైన పొగలు వచ్చాయి. దీంతో భయభ్రాంతులకు గురైన వారిద్దరూ వెంటనే కారు నుంచి దూరంగా వెళ్లిపోయారు. కేవలం ఐదు నిమిషాల్లోనే కారు కాలిపోయింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఫైరింజన్ సాయంతో మంటలను ఆర్పివేశారు. షాట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఎండీ ఆదేశాలతో ఎల్‌సీలు బంద్.!

విద్యుత్ కాంట్రాక్టర్ల పడిగాపులు

అనుసంధానానికి నోచుకోని కొత్త నెట్‌వర్క్‌లు

కోట్లు ఖర్చు చేసినా..

విద్యుత్ సరఫరా నోచుకొని వినియోగదారులు

గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు

డీడీలు చెల్లించి..పనులు చేసినా ఎల్‌సీ ఇచ్చేందుకు వెనుకడుగు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరా లేనిదే రోజువారి కార్యకలాపాలు పూర్తి చేయలేని పరిస్థితి. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో రకరకాల అవసరాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు కంపెనీలు, వ్యక్తులు తమ అవసరాల నిమిత్తం కొత్తగా ఏర్పాటు చేసుకునే విద్యుత్ నెట్‌వర్క్‌లను అధికారుల అనుమతులతోనే కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేస్తారు. తీరా ఆయా నెట్ వర్క్‌లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లేదా సబ్ స్టేషన్ నుంచి, ఒక ఫీడర్ నుంచి కొత్తగా వేసిన నెట్ వర్క్‌ను అనుసంధానం చేయాలంటే విద్యుత్ శాఖ నుంచి ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) ఇవ్వడంపై నిషేధాన్ని కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గత కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పుడూ లేదు. గతంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ.. కొత్తగా అవసరమైన నెట్‌వర్క్‌లను పెంచుతూనే..విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. గత రెండు నెలల నుంచి కాంట్రాక్టర్లు చేపట్టిన కొత్త నెట్‌వర్క్‌లను అనుసంధానం చేసేందుకు ఎల్‌సీ ఇవ్వడం లేదు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యుత్ కోతలు విధిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్ చేస్తామని ఆదేశించడంతో ఉన్నతాధికారులు ఎల్‌సీలపై పూర్తిగా నిషేధం విధించారు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి పనులు చేసిన కాంట్రాక్టర్లు, విద్యుత్ సరఫరా కోసం కోట్లు వెచ్చించిన వినియోగదారులు 2 నెలలుగా ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది.

నిర్వహణ, మరమత్తుల కోసం ఎల్‌సీలు..

నిరంతర విద్యుత్ సరఫరా కోసం తరచూ క్షేత్ర స్థాయిలో నిర్వహణ, మరమత్తులు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆయా ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి (లైన్ క్లియరెన్స్) పనులు చేపడుతుంటారు. జనవరి రెండో వారం నుంచి ఫిబ్రవరి 10 తేదీ వరకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందస్తు ప్రకటన చేసి, పనులు చేపట్టారు. అదే తరహాలోనే కొత్తగా అందుబాటులోకి వచ్చే నెట్‌వర్క్‌లను అనుసంధానం చేసేందుకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ముందుగానే సీబీడీ ద్వారా ప్రకటన చేసి ఎల్‌సీలు ఇచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు మాత్రం ఆ దిశగా ఆలోచించడం లేదని విద్యుత్ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. సుమారు 400 మందికి పైగా విద్యుత్ కాంట్రాక్టులు క్షేత్ర స్థాయిలో విద్యుత్ శాఖ అనుమతితోనే కోట్లాది రూపాయల డీడీలు చెల్లించి, పనులు నిర్వహించారు. కేవలం అరగంట, గంటపాటు ఇవ్వాల్సిన ఎల్‌సీని పూర్తిగా నిషేధించామని చెబుతూ.. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల విద్యుత్ కాంట్రాక్టర్లు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్తగా చేపట్టిన విద్యుత్ నెట్ వర్క్‌లను అనుసంధానం చేసేందుకు ఎల్‌సీలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరారు.

ఎండలు ముదరకముందే ఎల్‌సీలు ఇవ్వాలి

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో విద్యుత్ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు కొత్తగా లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటారు. అలాంటి వారికి కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసిన వెంటనే విద్యుత్ సరఫరాను అందించేందుకు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకోవాల్సి ఉంటుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్‌పీడీసీఎల్) పరిధిలోనే 2 నెలల్లో సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు ఉన్నాయి. వాటికి ఎల్‌సీ ఇవ్వాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉంది. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసి 2 నెలలుగా ఎదురు చూస్తున్నవాటికి వెంటనే ఎల్‌సీలు ఇవ్వాలి. దీని వల్ల కొత్త వారికి విద్యుత్ సరఫరా అందుతుంది. దీని వల్ల విద్యుత్ శాఖకు ఆదాయం వస్తుంది. పరిశ్రమలు, ఇతర కార్యకలాపాలు సాఫీగా సాగుతాయి.

- కందుకూరి శ్రీనివాస్,

అధ్యక్షుడు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

టానిక్ మద్యం దుకాణాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

కొనసాగుతున్న జీఎస్‌టీ అధికారుల సోదాలు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్‌లోని టానిక్ మద్యం దుకాణంతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో అదే పేరుతో ఉన్న మరో 10 దుకాణాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జీఎస్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో టానిక్ ఎలైట్ పేరుతో ప్రత్యేక జీవోతో 2016లో మద్యం దుకాణం వెలిసింది. ఇక్కడ రూ.1300 కంటే ఎక్కువ ఖరీదైన మద్యం, విదేశీ మద్యం విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ మద్యం విక్రయాలు, పన్ను ఎగవేత జరిగినట్లు ఆరోపణలు రావడంతో మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ, జీఎస్‌టీ అధికారులు సోదాలు చేశారు. బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా రంగంలోకి దిగింది. ఇదిలాఉండగా.. టానిక్ పేరుతో నగరంలో మరో 10 చోట్ల మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. సాధారణంగా మద్యం దుకాణాల టెండర్లలో దక్కించుకున్న ఈ 10 దుకాణాలకు టానిక్ పేరును జోడించి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రత్యేక జీవోతో నిర్వహిస్తున్న టానిక్‌కు, మిగతా టానిక్ దుకాణాలకు ఉన్న సంబంధాలను ఎక్సైజ్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. బుధవారం రాత్రి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు జూబ్లీహిల్స్ టానిక్‌తో పాటు మిగతా 10 దుకాణాలలో సోదాలు నిర్వహించారు. అధికారులు రెండు రోజులుగా సోదాలు నిర్వహిస్తూ.. రికార్డులను పరిశీలిస్తున్నారు. కాగా.. అటూ ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇటూ జీఎస్టీ అధికారులు ఈ సోదాలపై స్పష్టత ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.

పత్రాలు లేకుండా.. నగదు తరలింపు

స్వాధీనం చేసుకున్న పోలీసులు

అబిడ్స్, మార్చి 6: ఎలాంటి పత్రాలు లేకుండా నగదుతో వెళ్తున్న ఓ వ్యక్తిని షాహినాయత్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.17.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎల్. బాలు చౌహాన్ కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం గోషామహల్ అలస్కా హోటల్ చౌరస్తాలో ఎస్ఐ కె. లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఏఎస్ఐ బి.జయరాజు, పోలీస్ కానిస్టేబుళ్లు జి.పవన్‌కుమార్, ఎం. కిరణ్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. పోచారంలోఏని అన్నోజిగూడ సాయినగర్ కాలనీకి చెందిన విక్రంగౌడ్ ద్విచక్ర వాహనంలో రూ.17.5 లక్షల నగదు తీసుకెళ్తూ.. పట్టుబడ్డాడు. విచారణలో నగదుకు సంబంధించిన సరైన పత్రాలు చూపించలేదు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరుతో.. అర్చకుడికి టోకరా

వెంగళరావునగర్, మార్చి 6: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి.. అర్చకుడిని మోసం చేసి, డబ్బు కాజేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బీకేగూడలోని ఆదిత్యానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఆలయానికి వచ్చే బి.పృథ్వీతో అతడికి పరిచయం ఏర్పడింది. కొంత డబ్బు చెల్లిస్తే తాను క్లర్క్ హోదా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ సుబ్రహ్మణ్యంను నమ్మించాడు. అయితే, తనకు తెలిసిన మిత్రుడికి ఉద్యోగం కావాలంటూ చెప్పిన సుబ్రహ్మణ్యం.. గత నెల 20న గూగుల్‌పే ద్వారా పృథ్వీకి రూ.1.20 లక్షలు చెల్లించాడు. ఆ తరువాత 29వ తేదీన మరో రూ.30 వేలు చెల్లించాడు. మొత్తం రూ.1.50 లక్షలను తీసుకున్న పృథ్వీ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన సుబ్రహ్మణ్యం బుధవారం ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BORE WELLS

★శ్రీ వెంకటేశ్వర బోర్‌వెల్స్: 4 1/2 - 800 Fts., 6 1/2 - 2000 Fts., రీబోర్ & ఫ్లషింగ్ రీజనబుల్ ప్రైస్. సంప్ర: శ్రీనివాస్‌రెడ్డి, ఫోన్: 9000193999, 90002 93999. NT-313891

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-319968

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ. న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-319766

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-319987

TOURS & TRAVELS

★27/03 - 8 జ్యోతిర్లింగాలు, 4 ద్వారకలు 13 రో॥; ★11/04 - కాశీ, నేపాల్, ముక్తినాథ్ 19 రో॥; ★29/04 - రామేశ్వరం - 22 యా॥, 10 రో॥; ★29/04 - భువనేశ్వర్, గిరిజాదేవి, వైద్యనాథ్, కలకత్తా, గంగాసాగర్, గౌహతి కామాఖ్య; ★11/05 - ఆదికైలాష్ మరియు బద్రి, కేదార్, అష్టవినాయకులు, కర్ణాటక యాత్రలకు సంప్ర॥ భాస్కరరావు, 9848486847. NT-311575

★మహాదేవ టూర్స్: ప్రతినెల కాశీ యాత్ర, 11/04 - కామాఖ్య; ★12/05, 26/05 - చార్‌ధామ్; ★02/07, 16/07 - నవదేవి అమర్‌నాథ్; ★25/04 - ముక్తినాథ్; ★11/04 - రామేశ్వరం @ 9908844377. NT-311964

OLD AGE HOME

★మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036, 9700006699. NT-319830

HOME TUTIONS

★Home Tutions for Classes upto 10 (CBSE / ICSE / STATE), Intermediate, Degree, BE / B.Tech., IIT & NEET Foundation, Mains & Advanced, Chess by Talented Tutors. Welcome Male, Female Tutors. Contact: Ascent Study Circle, Ph: 9912353330, 9912340561. NT-319715

PLOT FOR SALE

★షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో గజం: 15,999/- వేలకే HMDA Approvedతో ఇల్లు కట్టుకోవడానికి రెడీగా ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ టీం కావలెను. Ph: +91 9030591797. NT-319386

★షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఔట్‌లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో, 0% ఇంట్రస్టుతో, 20 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, ఫ్రీ సైట్ విజిట్ కొరకు సంప్ర: 9949695027. NT-319836

**PLOT FOR SAL